ప్రేమ సమాధి!

అజీజ్

ముసక చీకటి!

ఆ చుక్కల వెలుగులో దారి చూసుకుంటూ ముందుకు సాగుతున్నాడు పరంధామయ్య. ఆయన అడుగులకి లయగా, చెప్పులు చేసే కిరకిర చప్పుడు తప్ప, పరిసరాలన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

కందిచేనులో పాలేర్లకి పనులు పురమాయించి, ఇంటికి తిరుగు ప్రయాణమయ్యేసరికి సంజె చీకట్లు ముసురుకున్నాయి. అడపాదడపా ఆయనలా పొలానికెళ్ళి రావడం పరిపాటే.

ఊరు యింకో ఫర్లాంగుదూరమే ఉందనడానికి సూచనగా కొద్దిదూరాన శిథిలావస్థలోవున్న నాయుడుగారి

మేడ కనిపిస్తోంది. ఆ మేడచుట్టూ చిన్న పిట్టగోడ కట్టి వుంది.

చూసే నాథుడు లేక, ఆలనాపాలనా లేక, ఆ కాంపౌండులో పిచ్చి మొక్కలు బాగా పెరిగివున్నాయి.

ఒకనాడు పూలచెట్లతో, ఘుమఘుమలాడే సన్నజాజి తీగలతో నూతన వధువులా వెలుగొందిన ఆమేడ, ఇప్పుడు చీకట్లో భూతనిలయంలా కనిపిస్తూ, రాత్రిళ్ళు ఆ దారిన వెళ్ళేవారి గుండెల్లో రక్తంతో గుబులు రేకెత్తిస్తుంది.

ఆ మేడ మెయిన్ గేటు దాటి, ముందుకు సాగబోతున్న పరంధామయ్య కాళ్ళకి బ్రేకులు పడ్డాయి. కళ్ళు చిట్లిస్తూ మేడవేపు చూసాడు. ఆయన ఆశ్చర్యానికి కారణం లేకపోలేదు.

మేడకింద అంతస్తు కిటికీలోంచి సన్నని మసక వెలుతురు కనిపిస్తోంది! తను పొరబడుతున్నాడా, అన్న సందేహంతో కళ్ళజోడుతీసి, కండువాతో తుడిచి పెట్టుకుని చూసేడు.

సందేహం లేదు. లోపల దీపం వెలుగుతోంది!

ఐదేళ్ళనుంచి మనుష సంచారం లేకుండా, పాడుపడున్న ఇంట్లో దీపం వెలగడమా? ఎవరు వచ్చారు?

కొంపదీసి... నైవేద్య తిరిగి రాలేదుకదా? ఔను. ఆమె తప్ప ఆ ఇంటికి వారసులంటూ ఇంకా యెవరున్నారీ లోకంలో? పన్నెండేళ్ళ క్రితం, ఇల్లు విడిచి పోయిన వ్యక్తి, ఐదేళ్ళక్రితం తండ్రి మరణించినా, కడచూపు కోసంకూడా రాని వ్యక్తి ఊహించని విధంగా యెలా వచ్చిందిప్పుడు?

సందేహ నివృత్తికోసం ఒక్కసారి ఆమెను చూడా లన్న జిజ్ఞాస మొలకెత్తింది పరంధామయ్యలో.

కాంపౌండ్ గేటుమూసి వుంది. అటు నడిచాడు. కొక్కెం ఎత్తి మెల్లిగా తోసాడు గేటుని. తెరుచుకో లేదు. చాలాకాలం చలనంలేక, తుప్పుపట్టి బిగుసుకు పోయివుంది.

కాస్త గట్టిగా తోసిచూసాడు. అరున్నొక్క రాగాలు పలుకుతూ తెరుచుకుంది. సాధ్యమైనంతవరకు చెప్పులు కిరకిర వినిపించకుండా అడుగులేస్తూ, కాంతి కనిపిస్తున్న కిటికీని సమీపించాడు.

ఆయన కిటికీగుండా లోనికి చూడటం, అదే సమయంలో ఓ స్త్రీ ఆకారం, కిటికీముందునుంచి మరోగది లోకి వెళ్ళడం లిప్తపాటులో జరిగిపోయాయి. ఆ ఆకారాన్ని చూడగానే పరంధామయ్య గుండె ఝల్లుమంది.

గుర్తించలేక పోయాడు, ఆమె నైవేద్య ఔనో కాదో? తెల్లచీర, విరబోసుకున్న జుత్తు. ఇవే ఆ మసక వెలుగులో పరంధామయ్య చూడగలిగింది. ఆమె అడుగు లకి లయగా, సన్నని గజ్జెల మోత కూడా వినిపించినట్టు స్ఫురించింది ఆయనకు తరువాత!

ఊపిరి బిగబట్టి, పదినిముషాలు అక్కడే నిల్చున్నాడు. మళ్ళీ ఆమె ఇవతలికి రాలేదు. తలుపు తడదామా? అన్న ఆలోచన వచ్చిందాయనకు క్షణకాలం. ధైర్యం చాలక వెనుదిరిగాడు.

యధాప్రకారం గేటుమూసి, ఊరివైపు అడుగులు వేశాడు. మగాడు తనకే ఆ ప్రదేశం అంత భయాన్ని

రేక త్రిస్తోంటే ఆడది ఒంటరిగా ఆ లంకంత యింట్లో ఎలా వుండగలుగుతుందో?

ఇంతకీ, ఆమె ఈ రోజే వచ్చిందా? నాలుగురోజుల క్రితం తను పనిమీద పొరుగూరెళ్ళాడు. ఈరోజే తిరిగి వచ్చాడు. రాగానే పొలం చూట్టానికెళ్ళాడు. ఆమె రెండుమూడు రోజులక్రితం వచ్చివుంటే ఆ సంగతి తనకు తెలీదు.

ఊరివైపు పురోగమిస్తున్న అడుగుల్లాగే, ఆయన మస్తిష్కం పన్నెండేళ్ళ వెనక్కి తిరోగమిస్తోంది.

పాపం నైవేద్య!

పంటకొచ్చిన పనసపండులాటి ప్రాయంలో, పాపిష్టి ప్రేమలోపడి, బ్రతుకంతా బీడుపాలు చేసుకుంది.

ఆ రోజుల్లో జగపతినాయుడుగారు ఆ ఊరికల్లా పెద్ద జమీందారు. ఆ ఊళ్ళోనేగాక, ఆ చుట్టుపక్కల గ్రామాల్లోకూడా ఆయనకి మంచిపరపతి ఉండేది. ఆయన ఒక్కగానొక్క కూతురే నైవేద్య.

బాల్యంలోనే ఆ పిల్లతల్లి మరణించడంతో, నాయుడుగారామెని అల్లారు ముద్దుగా పెంచారు. యుక్త వయసులో నైవేద్య ఓ యువకుడికి మనసిచ్చింది. అతనెవరో పరాయివాడేంకాదు. ఆ కుటుంబానికి సన్నిహితుడూ, నాయుడుగారి స్నేహితుడూ అయిన శివశంకరం కొడుకు పార్వతీశం.

బాల్యంనుంచీ, నైవేద్యా, పార్వతీశం ఒకేచోట ఆడుతూ పాడుతూ పెరిగారు. ఊళ్ళో స్కూల్ ఫైనల్ పాసయ్యాక, పైచదువులకోసం మద్రాసు వెళ్ళిపోయాడు పార్వతీశం.

హాస్టల్లో కాక, మద్రాసులోనే నివసిస్తున్న వాళ్ళ మేనత్త ఇంట్లో వుండి చదువుకోసాగాడు. అతని చదువు పూర్తయ్యాక నాయుడుగారు నైవేద్య నతనికే యిచ్చి పెళ్ళి చేస్తారని ఊళ్ళో అందరూ అనుకునేవారు.

పార్వతీశం బుద్ధిగా చదువుకుంటూ బి.ఏ. పూర్తిచేసి ఎల్.ఎల్.బి.లో చేరాడు. అక్కడే కథ అడ్డం తిరిగింది.

పార్వతీశం లా పూర్తవగానే, మద్రాసులోని అతని అత్తకూతురుతో అతని వివాహం జరిగిపోయింది. ఊళ్ళో అంతా నివ్వెరపోయారు.

ఆ అమ్మాయిపేరు ఉపాసన. అక్కడే అతనితో బాటు కాలేజీలో చదివేదట. ఆమెని అతనికే యిచ్చి చెయ్యాలని వాళ్ళ పెద్దలు మొదటినుంచీ అనుకునేవారట.

పార్వతీశానికా పెళ్ళి ఇష్టం లేకపోయినా పిరికివాడు గనుక పెద్దలముందు నోరువిప్పలేక పోయాడు.

ఆ సంఘటన, నైవేద్య మనసుని అగాధంపాలు చేసింది. పార్వతీశం భార్యా సమేతంగా స్వంత ఊరువచ్చి, ఇక్కడే ప్రాక్టీసు ప్రారంభించాడు.

అతను వచ్చిన ఏడారు నెలలతర్వాత నైవేద్య హఠాత్తుగా ఇంట్లోంచి వెళ్ళిపోయింది ఎవ్వరికీ చెప్పా చెయ్యకుండా. తనకా ఊరిమీదా, ఇంటిమీదా, చివరికి జీవితంమీదా విరక్తి పుట్టిందని, మనశ్శాంతి వెదుక్కుంటూ పోతున్నాననీ తనకోసం గాలించ వద్దనీ ఓ ఉత్తరం మాత్రం రాసిపెట్టి వెళ్ళింది.

అంతే! ఆ తరువాత మళ్ళీ ఆమెగురించి ఎవ్వరికీ తెలియదు.

నాయుడుగారు ఆమెను వెతకడానికి డబ్బును మంచి నీళ్ళలా ఖర్చుపెట్టేరు. లాభం లేకపోయింది. ఆయనకి దగ్గరి బంధువులంటూ ఎవ్వరూ లేరు. ఉన్న ఒక్క కూతురూ అలా అయిపోయిందే అన్న మానసిక వేదనతో మంచం పట్టేరు.

తమ కుటుంబ వినాశానికి మూలకారకుడైన పార్వతీశంపట్ల మాత్రం ఆయన ఎన్నడూ ద్వేషాన్ని ప్రకటించ లేదు. పైగా అతనిపట్ల సానుభూతి చూపేవారు. అంతే కాదు, తన మరణానంతరం యావదాస్తికి అతన్నే ట్రస్టీగా నియమించారు.

నైవేద్య ఇల్లువదలి వెళ్ళాక, దేశం నలుమూలలనుంచీ ఆమె పార్వతీశంపేర అనేక ఉత్తరాలు రాసిందిట. మనోవ్యాధితో నాయుడుగారు ఏడేళ్ళక్రితం మరణించారు. అప్పటినుంచి పార్వతీశమే వారి ఆస్తిపాస్తుల్ని ఆజమాయిషీ చేస్తున్నాడు.

స్వతహాగా అతను చాలా నెమ్మదస్తుడు. అటువంటి వాడికి ఉపాసనవంటి కోపిష్టి, దురహంకారి ఐన భార్య దొరికింది. ఊళ్ళో ఎవరికీ ఆమెపట్ల సదభిప్రాయంలేదు. మొగుణ్ణి రాచిరంపాన పెడుతుందిట. పట్నంలో పుట్టి పెరిగింది గనక, ఈ ఊరంటే ఆమెకి తగని రోత.

వారానికి రెండుసార్లైనా మద్రాసు వెళ్ళివస్తుంది. అంతేకాదు, అక్కడ క్లబ్బుల్లో విచ్చలవిడిగా తిరిగి వస్తుందని ఊళ్ళో అంతా చెవులు కొరుక్కుంటూంటారు. ఇందుకు మొగుడి మెతకదనమే కారణం. అంతా, పార్వతీశం లలాట లిఖితం!

ఇల్లు దగ్గిరపడటంతో పరంధామయ్య ఆలోచనలు చెదిరిపోయేయి.

భార్య అందించిన చెంబుతో కాళ్ళు కడుక్కుంటూ, చెప్పేడు. "పొలంనించి వస్తోంటే, ఊరవతల నాయుడు గారి మేడలో దీపం వెలుతురు కనిపించింది..."

"ఔనండోయ్! ఊర్నించి మీరొచ్చేక చెప్పడం మర్చాను. మూడ్రోజుల్నించీ ఊరంతా ఒకటే గుసగుసలు. ఆ మేడలో రాత్రి పూట దీపాలు వెలగడం ఒకరిద్దరు చూసారట.

నైవేద్య వచ్చి వుంటుందనీ, వెళ్ళి పలకరిద్దామనీ, పాత పరిచయస్థులు కొందరు, పగటిపూట వెళ్ళారుట. నైవేద్య తలుపు తెరవకుండా, లోపలినించే మాట్లాడిందిట వాళ్ళతో!"

"ఏమని?"

"తన ఆరోగ్యం బావులేదనీ, కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోదల్చాననీ, ఇప్పుడప్పుడే ఎవ్వరూ తన విశ్రాంతికి భంగం కలిగించవద్దనీ, కోలుకున్నాక ఊళ్ళోకి వచ్చి, అందర్నీ పలకరిస్తాననీ చెప్పిందిట!"

"పార్వతీశం ఉన్నాడా ఊళ్ళో?"

"ఏమో, నాకు తెలీదు! ఆ మేడలో ఆమె తప్ప మరెవ్వరూ వున్నట్టు లేదుట. దిక్కూ మొక్కూ లేని అటువంటి పాడుబడ్డ ఇంట్లో ఓ ఆడకూతురు ఒంటరిగా వుంటుందని తలుచుకుంటేనే నాకు ఒళ్ళు జలదరిస్తోంది సుమండీ!" అంది పరంధామయ్య భార్య.

ఉదయం వెళ్ళి పార్వతీశాన్ని కలుసుకోవాలి అనుకుంటూ ఇంట్లోకి నడిచాడాయన.

మర్నాడు పరంధామయ్య ఇంకా పార్వతీశం ఇంటి కెళ్ళకముందే, ఊరివాళ్ళ గుంపొకటి వచ్చిందాయన ఇంటికి.

వాళ్ళంతా నైవేద్యమీద ఫిర్యాదులు తీసుకొచ్చేరు.

"మనూళ్ళో ఇన్నాళ్ళూ వేశ్యాగృహాలు లేవని గర్విస్తూ వచ్చాం! మూడు రోజుల్నించీ, నాయుడుగారి మేడలో దీపాలు వెలుగుతున్నాయి. అంతేకాదు, ఆ ఇంట్లో, ఓ స్త్రీ ఆకారంకూడా కనిపిస్తోంది."

పన్నెండేళ్ళ క్రితం ఇల్లొదిలి పోయిన నాయుడుగారి కూతురు నైవేద్యవ తప్ప, ఆ ఇంట్లో ప్రవేశించే అధికారం ఎవరికుంది? ఎంత ప్రయత్నించినా ఊళ్ళో ఎవ్వరూ ఆమెని చూడలేక పోతున్నారు.

కాని, చీకటి పడగానే ఓ పురుషుడు ఒంటరిగా ఆ ఇంట్లో కెళ్ళడం, ఒకరిద్దరి కంటబడింది. మనూళ్ళో ఇటు వంటి చాటు మాటు వ్యవహారాలు జరగడం మేము సహించం!" అన్నాడో వృద్ధుడు.

"ఔను. రెండ్రోజుల క్రితం, ఆ ఇంటి చుట్టుపక్కల, చీకట్లో ఓ వ్యక్తి తచ్చాడుతూండటం నా కళ్ళారా చూసాను!" అన్నాడు మరొకడు.

పరంధామయ్య కాసేపాలోచించి, "మీ సూచనల ద్వారా ఆమె, ఆ ఇంట్లో, నీతి బాహ్యమైన జీవితం గడుపుతున్నట్టు నిర్ధారణ కాదు. ఆ పురుషుడు ఆమె తీసుకవచ్చిన నౌఖరే కావచ్చు.

లేదా, కాలప్రభావంవల్ల ఆమె మనోగాయాలు మాని, ఎవ్వరైన్నా పెళ్ళి చేసుకునుండవచ్చు. అతనామె భర్తే

అయుండవచ్చు. ఐనా, ఇక్కడ వ్యభిచారం చేసే ఖర్మ ఆమెకేం పట్టింది?" అన్నాడు.

అప్పుడు తట్టింది వాళ్ళకా ఆలోచన. "ఐతే, ఇంట్లోంచి ఎందుకు బైటికి రావడంలేదు? సాటి మనుషుల్ని దేనికి కలవడంలేదు? ఇరవై నాలుగ్గంటలూ తలుపులు మూసుకుని ఇంట్లో దేనిచేస్తూంది?" అడిగిందో స్త్రీ.

"బహుశా, కాలం ఆమె అందాన్ని హరించివేసిందేమో? ఏదైనా దుర్ఘటనకి గురై అవిటిదయిందేమో? సిగ్గుపడి బైటికి రావడం లేదేమో? ఆ విషయాలన్నీ నాకు వదిలి మీరు మీ పనులు చూసుకోండి!" అంటూ వాళ్ళని పంపేసి, చెప్పులు తొడుక్కుని, లాయర్ పార్వతీశం ఇంటికి బైలుదేరాడు పరంధామయ్య.

ఆయన పార్వతీశం ఇంటిని సమీపించడం, అదే సమయంలో పార్వతీశం భార్య ఉపాసన కారు నడుపుతూ గేటుగుండా బైటికి రావడం ఒకేసారి జరిగాయి.

బహుశా, ఆమె పట్నానికి ప్రయాణమై వుంటుంది. పరంధామయ్య కారుకడ్డం రావడంతో ఆపి, కనుబొమ లెగరేసింది.

"పార్వతీశం ఉన్నారా అమ్మా?" అడిగాడు.

"లేరు! కోర్టు పనిమీద వారం రోజులైంది మద్రాసు వెళ్ళి" చాలా పొడిగా జవాబిచ్చింది ఉపాసన.

"మళ్ళీ ఎప్పుడొస్తారో?"

"రేపు రావచ్చనుకుంటాను!" అంటూ కారు స్టార్ట్ చేసింది ఉపాసన.

ఆమె అలా పుల్ల విరుపుడుగా మాట్లాడుతోంటే, ఆమె ముందు నైవేద్య విషయం కదపడానికి మనస్కరించలేదు పరంధామయ్యకు.

తిరుగుముఖం పట్టేడు ఇంటికి.

ఏది ఏమైనా, ఒక్కసారి వెళ్ళి నైవేద్యని పలకరించాలి. ఆమె యోగక్షేమాలు కనుక్కోవాలి, అని నిశ్చయించుకున్నాడు. అందరిలా ఆమె తనతో మాట్లాడ్డానికి నిరాకరించదు. బాల్యంలో 'మామయ్యా' అని నోరారా ఆప్యాయంగా పిలిచేది.

పనులు ముగించుకొని సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో బైలుదేరాడు పరంధామయ్య నైవేద్య ఇంటికి.

అప్పటికే, పరిసరాలని చీకట్లు ముసురుకున్నాయి. గేటు తోసి కాంపౌండ్‌లో అడుగుపెట్టాడు. నిన్నట్లాగే, కిటికీగుండా ఇంట్లో వెలుగుతున్న దీపం వెలుగు కనిపిస్తోంది.

మూసి ఉన్న తలుపుని సమీపించాడు. ఇంట్లో అసలు మనుషులున్న అలికిడే లేదు! మునివేళ్ళతో మెల్లిగా తట్టాడు తలుపుని. లోపలినించి జవాబు రాకపోవడంతో, కాసేపాగి, గట్టిగా తట్టాడు.

నిశ్శబ్దం!

అలా కాదని, "అమ్మాయ్, నైవేద్యా!" పిలిచాడు గట్టిగా.

రెండు నిమిషాల తరవాత, ఎవ్వరో అవతలినించి తలుపుని సమీపిస్తున్న అడుగుల సవ్వడి వినిపించింది. తలుపు దగ్గర ఆగిపోయింది శబ్దం.

"ఎవ్వరు?" సన్నగా పలికింది స్త్రీ స్వరం.

"నేనమ్మా, పరంధామయ్యని! మునసబు పరంధామయ్యని!"

"అలాగా! ఏం కావాలి?"

"అదేమిటమ్మా! నీవు తిరిగొచ్చావని తెలిసి, చూసి పోదామనొచ్చాను."

"మీ పేరు నాకు జ్ఞాపకం లేదండీ!"

"పన్నెండేళ్ళ మాట కదా! పేర్లెలా జ్ఞాపకం వుంటాయి? నన్ను చూస్తే తప్పక గుర్తుపడతావమ్మా! ఇంటికి వచ్చిన అతిథిని ఇలా తలుపుదగ్గిరే నిల్చోబెట్టి మాట్లాడతావా?"

కాసేపు నిశ్శబ్దం! గడియతీస్తున్న చప్పుడు, కిర్రుమంటూ తెరుచుకుంది తలుపు కొద్దిగా.

"లోనికి రావచ్చా అమ్మా?"

"రండి!"

లోన అడుగుపెట్టాడు పరంధామయ్య.

అది విశాలమైన హాలు, ఐదేళ్ళనించీ, గోడలు సున్నానికి నోచుకోక రంగువెలసి నల్లబారేయి. ఆ ఇంటికి కరెంటు ఎప్పుడో పోయింది. ఎదురుగా, గూట్లో వెలుగుతోంది చిన్న దీపం. దాని కడ్డంగా నిల్చునుంది ఆమె!

అక్కడ తెల్లచీరలో ఓ స్త్రీ నిల్చున్నట్టు కనిపిస్తోందే తప్ప, ఆమె మొహాన్ని పోల్చుకోలేక పోతున్నాడు పరంధామయ్య.

"ఊరొచ్చాక పార్వతీశాన్ని కలిశావా అమ్మా?"

"రాగానే ఆయనకి కబురంపాను. పనిమీద మదరాసు వెళ్ళాడని తెలిసింది."

"నీ వెంట ఓ పురుషుడుకూడా ఉన్నట్టు ఊళ్ళో అంతా చెప్పుకుంటున్నారు. పెళ్ళిగానీ చేసుకున్నావా...?"

ఆమె పేలవంగా నవ్వింది. "ఆజన్మ బ్రహ్మచర్యం పుచ్చుకున్న నాకు పెళ్ళేమిటండీ?"

"ఐతే, అతను నీ సాక్షిగా ఉంటాడు."

"నేనెవ్వర్నీ నా వెంట తీసుకురాలేదు. అతనెవ్వరో నాకు తెలీదు!"

పరంధామయ్య నిశ్చేష్టుడైపోయి, "ఈ లంకంత ఇంట్లో ఒక్కర్తివీ ఎలా ఉంటున్నావమ్మా? నీ తిండి తిప్పలూ ఎవ్వరు చూస్తున్నారు? అవసరమైన వస్తువులు ఎలా అందుతున్నాయి?" అడిగాడు.

"ఇంతకాలం ఒంటరిగా జీవించినదాన్ని, అలవాటైపోయింది. ఈ ఒంటరితనం నన్నేమీ భయపెట్టదు. నా అవసరాలు నేను చూసుకోడంకూడా నా కలవాటే!"

"పగలూ, రాత్రీ నీవిలా బందీగా బ్రతకడం మాకు బాధాకరంగా ఉందమ్మా! పన్నెండేళ్ళ తరవాత నిన్ను చూసి ఆనందించాలని ఊళ్లో అంతా తహతహలాడి పోతున్నారు. ఓసారి అందర్నీ పరామర్శించివస్తే బావుండేది."

"నిజమే! కొద్దిరోజులు విశ్రాంతి తీసుకుని, అవసరమైనప్పుడు అందర్నీ కలుసుకుంటాను."

ఆమె అక్కడే నిల్చుని మాట్లాడుతోంది. కదలడంలేదు. కనీసం మర్యాదకైనా పరంధామయ్యను కూర్చోమన్లేదు. పన్నెండేళ్ళ ఎడబాటు ఆమెలో ఊరివాళ్ళమీద మునుపటి మమకారాన్నీ, ఆప్యాయతనీ తుడిచిపెట్టి ఉందనుకుని, నిట్టూర్చాడాయన.

"సరే, వెళ్ళొస్తానమ్మా! నావల్ల ఏదైనా సహాయం కావలిస్తే కబురుచెయ్!" అన్నాడు వెనుదిరుగుతూ.

"అలాగే! థాంక్స్!"

ఇంట్లోంచి బైటికి వచ్చి, గేటువైపు నడిచేడు పరంధామయ్య. వెనక తలుపు మూసుకున్న చప్పుడు!

గేటు తెరిచి బైటికి రాబోతున్న పరంధామయ్య ఉలిక్కిపడ్డాడు. కాంపౌండ్లో ఏపుగా పెరిగివున్న గడ్డి పొదల్లోంచి ఓ రాయి రివ్వున వచ్చి, ఆయన పాదాల ముందు పడింది!

చటుక్కున వంగి దాన్ని అందుకున్నాడు. దానికేదో కాగితం చుట్టి వుంది! గబగబ ఆ కాగితం విప్పి, జేబు లోంచి లైటర్ తీసి వెలిగించాడు. ఆ వెలుగులో, కాగితం మీద ఒకే ఒక పంక్తి స్పష్టంగా కనిపిస్తోంది.

'ప్రాణాలమీద ఆశ ఉంటే, నైవేద్యకు దూరంగా ఉండు!' ఆ వాక్యం చదివి నిర్ఘాంతబోయాడాయన.

తను ఇంట్లోకి వెళ్ళడం, నైవేద్యతో మాట్లాడి రావడం. అంతా బైట ఉండి ఎవ్వరో గమనించేరన్న మాట. ఎవ్వరు? ఏమిటీ హెచ్చరిక? చుట్టూ కలయ చూశాడు.

సరిగ్గా అదే క్షణంలో గడ్డి పొదలమధ్య సరసర చప్పుడైంది. భయంతో పరంధామయ్య గుండె వేగంగా కొట్టుకుంది. అంతవరకూ అక్కడ పొంచివున్న వ్యక్తి పారిపోతున్నాడా? గుండెలరచేతిలో పట్టుకుని అక్కడే నిల్చున్నాడు పరంధామయ్య.

రెండు నిమిషాల తరవాత, మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది పరిసరాలని. పరంధామయ్య మనసు కీడును శంకిస్తోంది. ఆ ఘటన ఆయన్ని కాస్త భయపెట్టినా, ధైర్యాన్ని మాత్రం సడలించలేదు.

నైవేద్య ఏదో అనూహ్యమైన ప్రమాదంలో ఇరుక్కున్నట్టు తోచి, ఆరాటంతో వెనుదిరిగి, మళ్ళీ ఇంటివైపు నడిచాడు. మెట్లెక్కి మూసి వున్న తలుపు తట్టేడు.

అదే అడుగుల శబ్దం!

తలుపు కవతల ఆగిపోయింది. "ఎవ్వరు?"

"నేనేనమ్మా, పరంధామయ్యని! నీతో ఓ ముఖ్య విషయం చెప్పాలి."

"ఏమిటి?"

"నేను గేటు దాటుతుండగా, చీకట్లో ఎవ్వరో. రాయికి ఉత్తరం చుట్టి, నావైపు విసిరేరు. అందులో, 'ప్రాణాలమీద ఆశ ఉంటే, నైవేద్యకి దూరంగా వుండు' అని రాసి వుంది!"

"ఐతే?"

"నువ్వేదో ప్రమాదంలో వున్నావని, నా మనసు ఆందోళన పడుతోందమ్మా."

"ఆ ఉత్తరం మీకోసం రాయబడింది. నాకోసం కాదు!"

"అందుకే,నువ్వుప్రమాదంలో వున్నావంటున్నాను."

"భయపడకండి. నన్ను నేను కాపాడుకోగలను!"

ఈమె ఆడదా? ఆదిశక్తా?? ప్రమాదం పొంచి వుంది మొర్రో అని మొత్తుకుంటున్నా, అంత నిశ్చింతగా మాట్లాడుతోందేమిటి?

"సరేనమ్మా. వస్తాను! నీకంత ధైర్యం వున్నప్పుడు అంతకన్నా ఏంకావాలి?" అంటూ వెనుదిరిగేడు పరంధామయ్య.

వడివడిగా అడుగులేస్తూ, అరగంటలో ఊరు చేరుకున్నాడు. దారి పొడవునా, ఆయనకు నైవేద్య ప్రవర్తన చాలా చిత్రంగా తోచింది.

ఆమెకు దూరంగా ఉండకుంటే తన ప్రాణాలు పోతా

యని ఆ ఉత్తరంలోని హెచ్చరిక! ఆ లెఖ్ఖన ఇప్పుడు తనూ ప్రమాదంలో వున్నాడు. ఈ విషయాన్ని అంత సులభంగా వదలకూడదు. ఇప్పుడే తేల్చిపారెయ్యాలి.

తిన్నగా పోలీస్ స్టేషన్ చేరుకున్నాడు పరంధామయ్య.

సబిన్స్పెక్టరుకు ఆ ఉత్తరం చూపి, మొదటినుంచీ అంతవరకూ జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించాడు:

అంతావిన్న ఇన్స్పెక్టర్ కాసేపు తీవ్రంగా ఆలోచించి "మీ వెంట నేనూ వస్తాను. ఈ వ్యవహారం ఏమిటో ఈరాత్రే తేల్చేద్దాం!" అన్నాడు.

3

పరంధామయ్య, సబిన్స్పెక్టర్నీ, ఓ హెడ్ కానిస్టేబుల్నీ వెంట బెట్టుకుని బయలుదేరాడు నాయుడుగారింటికి. అప్పుడు రాత్రి పదిగంటలవుతోంది.

గేటు తెరచి, నిశ్శబ్దంగా కాంపౌండ్లో ప్రవేశించారు.

"తలుపు తట్టేముందు, ఓసారి మేడచుట్టూ తిరిగి చూద్దాం పదండి." అంటూ వెనకవైపు నడిచాడు యిన్స్పెక్టర్.

పిచ్చిమొక్కల్నీ, గడ్డినీ దాటుకుంటూ వెనక్కి వెళ్లారు ముగ్గురూ. ఇన్స్పెక్టర్ జేబులోంచి టార్చితీసి వెలిగించాడు. అక్కడ ఒకప్పుడు మామిడితోట ఉండివుంటుందనడానికి గుర్తుగా, మచ్చుకి మూడు మామిడిచెట్లు మిగిలివున్నాయి.

టార్చి వెలుగులో, నేలమీద కనిపించిన దృశ్యంచూసి క్షణకాలం చకితులయ్యారు. ఎవరో కొత్తగా నేలను తవ్వినట్లు అక్కడక్కడా గుంతలు కనిపిస్తున్నాయి.

మేడ వెనక దొడ్డితలుపు మూసివుంది. ఇన్స్పెక్టర్

అటు నడిచి, మునివేళ్ళతో తోసాడు దాన్ని. కిర్రు మంటూ తెరుచుకుంది.

ముగ్గురూ ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

"తను ప్రమాదంలో ఉన్నానని తెలిసి కూడా, నైవేద్య యిలా దొడ్డితలుపు దేనికి తెరిచిపెట్టింది?" ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా అన్నాడు.

"అదే నాకూ అర్థం కావడంలేదు" అన్నాడు పరంధామయ్య.

ఒకరివెనుక ఒకరు లోనికి ప్రవేశించారు. అది చావిడి. అక్కడ మరో తలుపుంది. తోసాడు ఇన్‌స్పెక్టర్.

తెరుచుకుంది. లోనికి నడిచారు. చిమ్మచీకటి. ఇన్‌స్పెక్టరు టార్చి వెలిగించాడు. అది హాలు!

"నేను వచ్చినప్పుడు ఆ గూట్లోనే గుడ్డిదీపం వెలుగుతోంది" అన్నాడు పరంధామయ్య.

మేడలో ఎక్కడా చడీచప్పుడూ లేదు. భయంకర నిశ్శబ్దం! కింద రెండుమూడు గదులున్నాయి. అన్నీ గాలించారు. ఎవ్వరూ లేరు. ఇల్లంతా దుమ్మూ, దూళీ పేరుకునుంది.

"అమ్మాయ్ నైవేద్యా!" పిల్చాడు పరంధామయ్య.

జవాబు లేదు!

హాలుపక్కనే, పైకెళ్ళడానికి మెట్లున్నాయి.

మెట్లవెపు నడిచాడు ఇన్‌స్పెక్టర్. వాటిమీదా అంగుళం ఎత్తు దుమ్ము కనిపిస్తోంది. అదివరకు యెవరో చాలాసార్లు పైకెళ్ళినట్లు పాదముద్రలు అస్తవ్యస్తంగా పడున్నాయి. పైకి చేరుకున్నారు ముగ్గురూ.

అక్కడ మూడు గదులున్నాయి. రెండుగదుల తలు

పులు తెరుచున్నాయి. అందులో యెవరూ లేరు. మూడో గది మూసివుంది. తలుపుతో సాదు ఇన్ స్పెక్టర్. సన్నగా చప్పుడుచేస్తూ తెరుచుకుంది.

లోన అడుగుపెట్టి కెవ్వుమన్నాడు పరంధామయ్య.

ఓ గోడవారగా నులకమంచం. మంచంపైన పరుపు. ఆ పరుపుమీద పడుంది ఆమె వెల్లకిలా! సజీవంగాకాదు. నిర్జీవంగా!!

రెండు వక్షోజాలమధ్య పిడివరకూ దిగిన కత్తి. ధారలుగా కారిన రక్తం! విరబోసుకున్న జుత్తు.

టార్చివెలుగు మొహంమీద పడగానే "ఇన్ స్పెక్టర్ ఈమె నైవేద్యకాదు!" అన్నాడు పరంధామయ్య.

"ఎవ్వరు మరి?"

"నేనింతవరకూ ఈ అమ్మాయిని చూల్లేదు!"

"సాయంత్రం మీరు చూసిందీ, మాట్లాడిందీ ఈమె కాదా?"

"ఈమే!"

"మరి నైవేద్య కాదంటారేమిటి?"

"నేను చూసినప్పుడు హాల్లో గుడ్డిదీపం వెలుగుతుంది. పైగా ఈమె దానికడ్డంగా నిల్చుని మాట్లాడింది. నేనెంత కళ్లు చించుకున్నా ఈమెమొహం చూడలేక పోయాను. ఆ ఒడ్డూ పొడుగూ నాకు బాగా జ్ఞాపకం. ఆమె ఈమే!"

ఇన్ స్పెక్టర్ ఆయన్ని శవం దగ్గరికి తీసికెళ్ళి, "బాగా చూసి చెప్పండి. పన్నెండేళ్ళ దీర్ఘ సమయం మనిషిలో ఎన్నో మార్పులు తెస్తుంది." అన్నాడు.

పరంధామయ్య కాసేపు శవాన్ని పరిశీలించి, "కాదు.

నైవేద్య కాదు. ఆ చందనపు బొమ్మకీ, ఈమెకీ ఎక్కడా పోలికలేవు!'' అన్నాడు.

"ఐతే, నైవేద్యలా నటిస్తూ మూడు రోజుల్నించీ ఈమె ఇక్కడెందుకుంది?".

"అదే నాకూ బోధపడటం లేదు. ఈమె వచ్చింది మొదలు ఓ గుర్తు తెలియని వ్యక్తి ఈ చుట్టుపక్కల తిరుగుతూ కనిపించాడుట. బహుశా వాడే ఈ పని చేసుంటాడు'' అన్నాడు పరంధామయ్య.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపుతూ, గదంతా కలయచూశాడు. ఓ మూల టేబిల్ మీద పెద్ద సూట్ కేస్ కనిపించింది. గబ గబ అటు నడిచి, సూట్ కేస్ తెరిచాడు.

చీరలూ, బ్లౌజులూ, టాయిలెట్ సామాన్లూ గాక, డజనుకు పైగా రకరకాల డ్రైఫుడ్ టిన్స్ ఉన్నాయందులో.

"చూశారా! భోజనం వండుకునే అవసరం లేకుండా వెంట డ్రైఫుడ్ టిన్స్ కూడా తెచ్చుకుంది. ఈ మూడు రోజులూ వీటితోనే గడిపుండాలి!'' అంటూ సూట్ కేస్ లోని సామానంతా బోర్లించాడు ఇన్‌స్పెక్టర్.

అడుగున చిన్న వేనిటీ బ్యాగ్ కనిపించింది. దాన్నందుకుని తెరిచాడు. నూటయాభై రూపాయలూ, కొంత చిల్లరా, ఓ విజిటింగ్ కార్డ్ బైటపడ్డాయి. ఆత్రంగా ఆ కార్డందుకుని చూసాడు.

మిస్. గీతాంజలి.
బ్లూస్టార్ నైట్ క్లబ్.
మద్రాసు.

"హమ్మయ్య! హతురాలి ఊరూ పేరూ తెలిసేయి. ఈ మాత్రం చాలు. వెంటనే మద్రాసు క్రయింబ్రాంచికి మెసేజ్ పంపాలి. ఇది హత్యకేసు. వాళ్ళే పరిశోధిస్తారు. నువ్విక్కడే శవాన్ని చూస్తూండు, నేవెళ్ళి మెసేజ్ పంపుతాను" అని హెడ్ కాన్స్టేబుల్కు చెప్పి, పరంధామయ్యను వెంటబెట్టుకుని బైలుదేరాడు సబిన్స్పెక్టర్.

4

మద్రాసు క్రయింబ్రాంచి హెడ్క్వార్టర్స్ నించి ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, సార్జంట్ డేవిడ్ పంపబడ్డారక్కడికి.

రాజారెడ్డి ఆ యువతి శవాన్నీ, ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించాడు. పరంధామయ్య చెప్పిన కథనం విన్నాడు. తెలతెలవారుతుండగా, శవాన్ని మార్చ్యురీకి స్థానిక సివిల్ హాస్పిటల్కు తరలించారు. అప్పటికే ఆ వార్త దావానలంలా వ్యాపించింది ఊరంతా.

ఆ మేడ ముందు ఇద్దరు కానిస్టేబుళ్ళని కాపలా నియమించి, మిగతా అందరూ స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకున్నారు.

"ఈ కేసులో ఒకే ఒక విషయం చాలా క్యూరియస్గా ఉంది. మేడ వెనక, కొత్తగా తవ్వబడ్డ గుంతలు! ఏమిటవి? ఎవరు తవ్వేరు? ఆ గుంతలకీ, ఆమె హత్యకీ సంబంధం ఉందా? ఒక అనామకురాలు, నైవేద్యగా నటిస్తూ, ఆ మేడలో దేనికి తిష్ట వేసింది?" అన్నాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి తీవ్రంగా ఆలోచిస్తూ.

అదే సమయంలో, టేబిల్ మీది టెలిఫోన్ గణగణమంది. సబిన్స్పెక్టర్ రిసీవర్ అందుకుని, "ఎస్! పోలీస్ స్టేషన్" అన్నాడు.

"నేను, పార్వతీశం మాట్లాడుతున్నాను. మద్రాసు నించి రాగానే, కొద్దిరోజులుగా నాయుడు గారింట్లో జరిగిన విచిత్ర సంఘటనలు తెలిసేయి. మీతో మాట్లాడి వివరాలు తెలుసుకోవాలనుంది!"

"రండి. వెంటనే బైలుదేరి రండి."

"థాంక్స్!" అవతల ఫోన్ డిస్కనెక్ట అయింది.

రిసీవర్ దించి, ఫోన్ ఎవరు చేశారో చెప్పాడు సబిన్స్పెక్టర్.

"పామ్మయ్యా! పార్వతీశం సమయానికి వచ్చాడు" అన్నాడు పరంధామయ్య.

ఐదు నిమిషాల తరవాత పోలీస్ స్టేషన్ ముందు, ఓ ఫియట్ కారు వచ్చి ఆగింది. బక్కపల్చగా ఉన్న ఓ వ్యక్తి కారు దిగి, లోనికి వచ్చాడు.

"వీరే, లాయర్ పార్వతీశం!" అంటూ రాజారెడ్డికి పరిచయం జేసేడు సబిన్స్పెక్టర్.

నలభై ఏళ్ళుంటాయి పార్వతీశానికి. కోల మొహం. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టుండే కళ్ళు. అక్కడక్కడా నెరసిన ఉంగరాల జుత్తు. కళ్ళకి అద్దాలు.

అతను కూర్చున్నాక, "నాయుడుగారు మరణిస్తూ, ఆయన యావదాస్తికీ మిమ్మల్నే ట్రస్టీగా నియమించారు కదూ?" అడిగాడు రాజారెడ్డి.

పార్వతీశం తలూపి, "ఇప్పుడా ఆస్తికి ఏకైక వారసురాలు నైవేద్య! పన్నెండేళ్ళ క్రితం ఆమె ఇల్లు విడిచి వెళ్ళిపోయింది.

ఆ బెంగతో నాయుడుగారు మంచంపట్టి, ఐదేళ్ళ క్రితం పోయేరు. విచిత్రం ఏమిటంటే, తండ్రి మరణించిన

ఆర్నెల్ల తరవాత హఠాత్తుగా నైవేద్య నాకో ఉత్తరం రాసింది!'' అన్నాడు.

''ఏమని?''

''తను ఇల్లు విడిచేటప్పుడు తెచ్చుకున్న నగా నట్రా అమ్ముకుంటూ, ఇంతకాలం దేశంలోని వివిధ పుణ్య క్షేత్రాలు దర్శిస్తూ గడిపేసనీ, ఇప్పుడు చేతిలో డబ్బంతా హరించుకుపోయిందనీ, వెంటనే డబ్బు పంపమనీ కలకత్తా నించి రాసింది ఆ ఉత్తరం!

అలా అనుకోకుండా ఆమె ఆచూకీ తెలిసినందుకు నేనెంతో సంతోషించాను. దురదృష్టవశాత్తూ ఆ వార్త విని ఆనందించడానికి నాయుడుగారు లోకంలో లేరు.

నైవేద్య కోరిన ప్రకారం, ఆమె పేర ఐదువేల రూపాయల చెక్కు పంపాను. దానితో బాటు ఆమె తండ్రి మరణించిన విషయం తెల్పుతూ వెంటనే ఇంటికివచ్చి, ఆ ఆస్తిపాస్తులు చూసుకోమని జాబురాసాను.

కొద్దిరోజుల్లోనే ఆమెనుండి రెండో వుత్తరం వచ్చింది. తండ్రి మరణం తననెంతగానో క్రుంగదీసిందనీ, ఇంటికి రాలేననీ, వస్తే తండ్రి జ్ఞాపకాలు వేధిస్తాయనీ, తను ఒక చోట స్థిరంగా ఉండననీ, చిరునామా మారినప్పుడల్లా తెలియజేస్తాననీ రాసింది.

తరవాత, దేశం నలుమూలలనించీ ఆమె ఉత్తరాలు రాసాగాయి డబ్బుకోరుతూ. కోరినంత పంపేవాణ్ని. చివరికి భూమీపుట్రా అమ్మే స్థితికూడా వచ్చింది. దానికామె అభ్యంతరం చెప్పలేదు.

ఇన్నాళ్లూ ఆమె ఆ ఆస్తిపాస్తులు కొద్దికొద్దిగా అమ్ముతూ డబ్బు పంపేను. వారంరోజులక్రితం ఆమె రాసిన చివరి

ఉత్తరం మద్రాసునించే వచ్చింది! అందులో అర్జంటుగా ఆరువేలు కావాలని రాసింది. తన చిరునామా తెల్పకుండా, కేరాఫ్ జనరల్ పోస్టాఫీస్ పేర డబ్బు పంపమని కోరింది!"

"పంపారా?"

పార్వతీశం పెదవి విరిచి, "నా స్వంత డబ్బులో కొంత పంపవలసి వచ్చింది. కారణం, ఇప్పుడామె ఆ స్త్రీలో మిగిలినదల్లా రెండే రెండు వస్తువులు" అన్నాడు.

"ఏమిటవి?

"ఒకటి వాళ్ళ ఇల్లు. రెండోది..." అంటూ ఆగి పోయాడు పార్వతీశం.

"చెప్పండి!"

"క్షమించండి ఇన్‌స్పెక్టర్! నేను చెప్పకూడదు. ఆ రహస్యాన్ని వైదేహికి తప్ప మరెవ్వరికీ చెప్పవద్దని, నాయుడుగారు మరణిస్తూ నాచేత ప్రమాణం చేయించారు. మరణించినవారి చివరికోరిక మన్నించడం మన సాంప్రదాయం!

ఆ రహస్యం ఉత్తరాల్లో రాసేది కాదు గనక, వైదేహి రాసే ఉత్తరాల్లో నేనెప్పుడూ దాని ప్రస్తావన ఎత్తలేదు. ఏదో ఒకనాడామె తిరిగి వస్తుందికదా, అప్పుడు చెబుదామని ఊరుకున్నాను.

ఇప్పుడు ఆ సంతా హరించుకుపోయింది. పైగా, ప్రస్తుతం వైదేహి మద్రాసులోనే ఉంది. ముఖాముఖి కలుసుకుని చెబుదామని, మద్రాసు వెళ్ళి ఎంత గాలించినా ఆమె ఆచూకీ దొరకలేదు.

తను కనిపిస్తే, బలవంతంగా ఎక్కడ ఇంటికి లాక్కుపోతారో అని భయపడి, కనిపించకుండా జాగ్రత్తపడు

తోంది కాబోలు!''

''నేనోకసారి ఆమె రాసిన ఉత్తరాలు చూడాలను కుంటున్నాను. దానివల్ల ఆమె సైకాలజీ స్టడీ చెయ్యవచ్చు. చూపిస్తారా?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''తప్పకుండా! ఇప్పుడే పట్టుకొస్తాను'' అంటూ లేచాడు పార్వతీశం.

కార్లో వెళ్ళి, పది నిముషాల్లో తిరిగి వచ్చాడు.

అతని చేతిలో చిన్న ఉత్తరాల కట్ట వుంది. దాదాపు పాతిక ఉత్తరాలు వుంటాయవి. వాటితోబాటు వైదేహిని డబ్బు పంపిన రసీదులూ వున్నాయి.

కట్ట విప్పి, మొదటి ఉత్తరం అందుకున్నాడు ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి. అది పన్నెండేళ్ళ క్రితం వైదేహి ఇల్లు విడిచిపోతూ రాసిన ఉత్తరం!

'డియర్ పార్వతీశం!

జీవితంలో మనం ఏవేవో అనుకుని ఊహాహార్మ్యాలు నిర్మించుకుని అలాగే జరుగుతాయను కుంటాము. కాని, పీధి పీచే వడగాడ్పుల కవన్నీ త్రుటిలో శిధిలమౌతాయని నా కిప్పుడే తెలిసింది.

నీవంటి పిరికివాడికీ, అర్భకుడికీ మనసిచ్చి నే నెంత పొరబాటు చేశానో ఇప్పుడే గ్రహించాను. నా మనసు విరిగిపోయింది. జీవితంమీదే విరక్తి పుట్టింది. నీకు దూరంగా, దిగంతాల కందనంత దూరంగా పారిపొమ్మని, మనసు పదేపదే ఆరాట పెడుతుంది.

వెళుతున్నాను. మనశ్శాంతిని వెదుక్కుంటూ వెళ్ళిపోతున్నాను. అది దొరికిననాడే నిశ్శేషంగా

తిరిగి వస్తాను. అంతవరకూ సెలవ్. నాన్నగారికి ధైర్యం చెబుతూ వుండు. నేను తప్ప ఆయనకీ లోకంలో మరెవ్వరూ లేరు! ఉంటాను.

ఇట్లు

నైవేద్య'

ఆ తరవాత, చాలా కాలానికి కలకత్తానించి రాసింది ఉత్తరం. అదే ఆమె డబ్బు పంపమని కోరుతూ రాసిన మొదటి ఉత్తరం.

ఆ తరవాతి ఉత్తరాలన్నీ దేశంలోని వివిధ ప్రదేశాల నించి వచ్చినవి. చివరి ఉత్తరం మాత్రం కొద్ది రోజుల క్రితమే మద్రాసునించి పోస్ట్ చెయ్యబడింది.

ఉత్తరాలు చూడటం పూర్తయ్యేక, రసీదులు పరిశీలించాడు రాజారెడ్డి. అన్నీ పెద్దపెద్ద మొత్తాల్లో డబ్బు పంపినవి.

తిరిగి వాటిని కట్టకట్టి పార్వతీశానికిస్తూ, "ఆల్ రైట్! మీరు వెళ్ళి రెస్టు తీసుకోండి. అవసరమైతే మళ్ళీ పిలిపిస్తాం!" అన్నాడు ఇన్స్పెక్టర్.

పార్వతీశం వెళ్ళిపోయాడు.

5

టెలిఫోన్ మోగింది.

సబిన్స్పెక్టర్ రిసీవర్ అందుకుని, "ఎస్, స్పీకింగ్!" అన్నాడు.

"నేను. హాస్పిటల్ నించి డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతున్నాను. మీరు తక్షణం ఇక్కడికి రావాలి!"

"ఏం జరిగింది?"

"మీరు పంపిన శవాన్ని నేను మార్చ్యురీ జరప బోతుండగా, ఓ వ్యక్తి వచ్చి, ఇక్కడ పెద్ద గొడవచేస్తు న్నాడు. మనిషి బాగా తాగి వున్నాడు. పేరు ఆనంద రావుట. ఆ శవాన్ని ఒక్కసారి చూసి తీరాలని పట్టుబడు తున్నాడు."

"ఎందుకు?"

"ఆమె నైవేద్య ఔనో, కాదో చూసి గుర్తుపడతా డట!"

"ఆల్ రైట్! అతన్నక్కడే ఆపి వుంచండి. క్షణంలో వచ్చేస్తాం!" అంటూ రిసీవర్ దించి, ఆ విషయాన్ని రాజారెడ్డికి వివరించాడు సబిన్ స్పెక్టర్.

"ఏ ఆనంతరావు? బట్టలదుకాణం ఆనందరావేనా?" అడిగాడు పరంధామయ్య మధ్యలో.

"ఔను. వాడే! ఊళ్లో తప్పతాగి, గొడవచేసేది వాడేగా?"

"అర్థమైంది. నైవేద్య యుక్తవయసులో, ఆమెని అజ్ఞాతంగా ఆరాధించిన వాళ్ళలో అతనూ ఒకడు. అత నిది ఏకపక్షం ప్రేమ. నైవేద్య ఇల్లు విడిచిపోవడంతో, ఆమెని మర్చిపోడానికి తాగుడలవాటు చేసుకున్నాడు.

తప్పతాగి, నైవేద్య నామం జపిస్తూ వీధుల్లో తిరిగే వాడు. దారికి తేవాలని పెద్దలు పెళ్ళిచేసారు. ఐనా, తాగుడు మానలేదు. అదీ కథ!" అన్నాడు పరం ధామయ్య.

"ఆ దేవదాసెవరో మనమూ చూద్దాం పదండి." అన్నాడు ఇన్ స్పెక్టర్ రాజారెడ్డి లేస్తూ.

అందరూ జీప్ లో హాస్పిటల్ చేరుకున్నారు.

ఆనందరావు వరండాలో బెంచీమీద కూర్చొని వున్నాడు.

నోటికి విరామం లేకుండా ఏదో వాగుతున్నాడు. "ప్లీజ్...ఒక్కసారి ఆమెని చూడనివ్వండి...నా సర్వస్వాన్ని ఒక్కసారి చూడనివ్వండి డాక్టర్! ఆమె... నైవేద్య ఔనో...కాదో చిటికెలో, చెప్పేస్తాను..."

రాజారెడ్డి అతని భుజం తట్టి—"నీకా అవసరం లేదు. ఆమె నైవేద్య కాదని తేలిపోయింది." అన్నాడు.

ఆనందరావ్ ఇన్‌స్పెక్టర్ని ఎగాదిగా చూసి, "నన్నాపడానికి నువ్వెవరు?" అన్నాడు అరుస్తూ.

ఇన్‌స్పెక్టర్ ఏదో చెప్పబోతుండగా, అప్పుడే హాస్పిటల్లోంచి వరండాలోకి వచ్చిన ఓ మధ్య వయస్కురాలు, ఆనందరావుని చూసి తక్కున ఆగిపోయింది.

"ఇన్‌స్పెక్టర్ గారూ! రాత్రి నాయుడుగారింటి దగ్గర ఇతను అనుమానాస్పదంగా తిరుగుతుండటం నా కళ్ళారా చూశాను" అంది సబిన్‌స్పెక్టర్‌తో.

అది విని అక్కడున్నవాళ్ళంతా నివ్వెరపోయారు.

ఆనందరావామెని మింగేసేలా చూస్తూ, "ఔను. వెళ్ళాను. నీకెందుకు" అన్నాడు రంకెలేస్తూ.

ఇన్‌స్పెక్టర్ అతన్నాపి, "ఆ మేడదగ్గరి కెందుకెళ్ళావు?" అడిగాడు.

"ఇంకా ఎందుకు? నైవేద్యని చూట్టానికి. ఆమె ఊళ్ళోకి వచ్చి మూడు రోజులైనా ఎవ్వర్నీ కలవలేదు. ఎవ్వరూ ఆమెని చూళ్ళేదు. కనీసం నేనైనా ఒక్క చూపు చూసివద్దామని వెళ్ళాను."

"ఇతను కిటికీ దగ్గర నిల్చుని, తొంగి తొంగి చూస్తూ

కనిపించాడు నాకు. ఇతనే ఆమెని చంపుంటాడు!"
మధ్యలో అందుకుందా స్త్రీ.

ఆమెమీద కురకబోతున్న ఆనందరావు నాపి, "అప్పుడు టైం ఎంతై వుంటుంది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"తొమ్మిది గంటలనుకుంటాను."

"అంత రాత్రి మీ రక్కడేం చేస్తున్నారు?"

"ఆఁ, అలా అడగండి ఇన్‌స్పెక్టర్." అన్నాడు ఆనందరావ్.

"పనిమీద రంగాపురం వెళ్ళొస్తున్నాను. అక్కణ్నించి బైలుదేరేసరికి చీకటి పడింది. ఇతను నాయుడు గారింటి గేటు తెరుచుకుని లోనికెళ్ళడం చూశాను, మసక చీకట్లో.

ఏం చేస్తాడో చూద్దామని అక్కడే నిల్చున్నాను. దొంగలా కిటికీని సమీపించాడు. అప్పుడా కిటికీ తెరిచుంది. లోపల చిన్న దీపం వెలుగుతోంది. అందుకే, నే నతన్ని బాగా గుర్తుపట్టగలిగేను."

"ఔను...వెళ్ళాను...అంతేగాని, ఆమెని చంపలేదు.. నా ఆరాధ్యదేవతని చేజేతులా ఎలా చంపుతాననుకున్నావ్?" అరిచాడు ఆనందరావు.

అదే సమయంలో మరో స్త్రీ అక్కడికి వచ్చి, ఆనందరావుని చూసి, "ఇక్కడేం చేస్తున్నారండీ? తాగితే ఒక్కచోట పడుండరుగదా! పదండి ఇంటికి" అంది అతని రెక్క పుచ్చుకుంటూ.

"ఎవ్వరీమె?" అడిగాడు రాజారెడ్డి పరంధామయ్యని.

"ఆనందరావు భార్య!"

"ఇప్పుడతను మనలో లేడు. తర్వాత మాట్లాడదాం. వెళ్లనివ్వండి" అన్నాడు సబిన్‌స్పెక్టర్‌తో.

భార్యవెంట వెళ్లిపోయాడు ఆనందరావ్.

డాక్టర్‌తో శవపరీక్ష ప్రారంభించమని చెప్పి, తిరిగి జీపులో బయలుదేరారంతా.

6

పోలీసు స్టేషన్‌ముందు జీపాపి, వాళ్లు లోనికెళ్లారో లేదో, ఓ అంబాసిడర్ కారువచ్చి ఆగింది గేటుదగ్గర.

నాయుడు గారింటిముందు కాపలా వుంచి వచ్చిన కానిస్టేబుల్లూ, ఫుల్‌సూటులోవున్న ఓ ఆరడుగుల వ్యక్తి దిగి లోనికి వచ్చారు.

"ఏం జరిగింది? ఈయనెవరు?', అడిగాడు సబిన్‌స్పెక్టర్ వాళ్లని.

"ఆకార్లో ఈయన నాయుడుగారింటికివచ్చి, ఒక్కసారి ఆ యింట్లోకెళ్ళి చూడనివ్వమని మాతో పేచీకి దిగాడు. అనుమానంవేసి, లాక్కొచ్చాం" అన్నాడో కానిస్టేబుల్.

సబిన్‌స్పెక్టర్ ఆ వ్యక్తిని ఎగాదిగాచూసి, "యెవ్వరు మీరు? నాయుడుగారింట్లో మీకేం పని?" అడిగాడు.

అతను మౌనంగా జేబులోంచి ఓ విజిటింగ్ కార్డుతీసి బల్లమీద గిరాటేశాడు. సబిన్‌స్పెక్టర్ కార్డందుకుని చూసాడు.

'మిస్టర్ దివాకర్,
ప్రొప్రయిటర్ బ్లూస్టార్ నైట్‌క్లబ్,
మద్రాసు' అని వుంది.

ఆ చిరునామా చదివి నిశ్చేష్టుడయ్యాడు సబిన్స్పెక్టర్. కారణం రాత్రి హత్యచెయ్యబడ్డ యువతి పర్సులోనూ ఇదే అడ్రస్ ముద్రించిన కార్డు దొరికింది. దీన్ని కేవలం కాకతాళీయమనుకోవాలా? లేక...

ఆలోచిస్తూ దాన్ని రాజారెడ్డి కందించి "నా రెండో ప్రశ్నకు మీరింకా జవాబివ్వలేదు" అన్నాడు అతన్ని చూస్తూ.

ఈమధ్య ఆయింటిని అమ్మబోతున్నట్టు లాయర్ పార్వతీశంగారు పత్రికల్లో ప్రకటించిన వార్తచూసి, దాని ఖరీదు ఎంతవుంటుందో ప్రత్యక్షంగా అంచనా వేసుకుందామని బయలుదేరాను.

ఆ ఇంటిముందు పోలీసులు కాపలా వున్నారు. అక్కడ వారి కాపలా ఎందుకో నాకు తెలియదు. ఐనా, ఎలాగూ ఇంతదూరం వచ్చాను గనక, ఓసారి లోపల కెళ్ళి చూద్దామని ట్రైచేశాను. అంతే. ఇక్కడికి లాక్కొచ్చారు వీళ్ళు. నేనోసారి లాయర్ పార్వతీశంగార్ని కలుసుకోవాలనుకుంటున్నాను" అన్నాడతను.

"గీతాంజలి తెలుసా మీకు?" హఠాత్తుగా అడిగాడు ఇన్స్పెక్టర్ రాజారెడ్డి అతన్ని.

అతని కనుబొమలు ముడివడ్డాయి. "ఏ గీతాంజలి?"

"ఆ పేరుగల వారెవ్వరూ మీక్లబ్లో లేరా?"

"లేరే!"

"ఆల్ రైట్! పార్వతీశంగార్ని కలుసుకోవాలన్నారు కదూ? వెళ్ళండి."

"థాంక్స్! వస్తాను" అంటూ బయటకి నడిచాడతను.

"డేవిడ్! ఫాలోహిమ్!" అన్నాడు ఇన్స్పెక్టర్

రాజారెడ్డి సార్జంట్‌తో.

అప్పటికే దివాకర్ తన కారెక్కి వెళ్లిపోయాడు.

సార్జంట్ గబగబ బయటకెళ్లి జీపెక్కాడు.

పావుగంటలోపల తిరిగి వచ్చింది జీపు.

"అతను లాయర్ ఇంటికి వెళ్ళలేదు సార్. అరవై మైళ్ల స్పీడుతో మద్రాసువైపు పోతున్నాడు" అన్నాడు డేవిడ్.

ఇన్‌స్పెక్టరిద్దరూ వొకరి మొహాలొకరు చూసుకున్నారు.

"వెంటనే పార్వతీశాన్ని పిల్చుకురా!" అన్నాడు రాజారెడ్డి.

సార్జంట్ వెళ్ళి పదినిముషాలలో అతన్ని వెంటబెట్టుకొచ్చాడు.

"మీరా ఇల్లు అమ్మబోతున్నట్టు పత్రికల్లో ప్రకటించారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"లేదే! ఎవరుచెప్పారు మీకు?" నోరు తెరిచాడు పార్వతీశం. ఇన్‌స్పెక్టర్ జరిగింది అతనికి వివరించాడు.

అంతా విన్న పార్వతీశం భ్రుకుటి ముడివడింది. సాలోచనగా తలూపి, "ఇప్పుడర్థమయింది! ఇన్‌స్పెక్టర్ గారూ! ఇక దాచి లాభంలేదు. నాభార్య ఉపాసనకి క్లబ్బులో పేకాట ఆడే దురలవాటుంది.

ఆమె దురదృష్టమో, నాఖర్మో తెలీదుగానీ ఉపాసన తరచూ జూదంలో ఓడిపోతుంది. అప్పుడప్పుడూ క్లబ్బువాళ్ళకి బాకీపడుతుంది. అవి చెల్లించేది నేనే. ఆమెనా దురలవాటునుంచి తప్పించడానికి నేనుచేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

ప్రస్తుతం ఆమె మద్రాసులోనే వుంది. బ్లూస్టార్ నైట్ క్లబ్బులోనే తరచూ ఆడుతుంది. బహుశా, ఈ మధ్య ఏ పెద్ద మొత్తమో అక్కడ బాకీపడుంటుంది. అందుకే నన్ను కలుసుకొని, బాకీకింద నాయుడుగారి ఇల్లు కొనెయ్యమని అతన్ని ఆమే పంపివుంటుందని నా అనుమానం!'' అన్నాడు నీరసంగా.

''అటువంటి భార్యని మీరింతకాలం ఎలా భరిస్తున్నారు? ఇన్ని అవస్థలు పడేకంటే, విడాకుల ద్వారా ఆమెనించి విముక్తి పొందవచ్చుగా?'' అన్నాడు యిన్స్పెక్టర్.

పార్వతీశం పేలవంగా నవ్వి ''నాలో అంత ధైర్యమే వుండివుంటే ఆమెనసలు కట్టుకునే వాణ్నేకాదు.'' అన్నాడు.

అదే సమయంలో టెలిఫోన్ మోగింది.

సబిన్స్పెక్టర్ రిసీవర్ అందుకుని ''ఎస్...స్పీకింగ్!'' అన్నాడు.

''ఇన్స్పెక్టర్! మీరు వెంటనే హాస్పిటల్ కిరాగలరా!'' అవతలినించి డాక్టర్ కంఠం వినిపించింది ఆతృతగా.

''వాట్ హేపెండ్ సార్?''

''మీరు తక్షణం ఇక్కడికి రావాలి. శవంలోంచి ఆశ్చర్యకరమైన వస్తువొకటి బయటపడింది!''

''ఇప్పుడే వస్తున్నాం!'' అంటూ రిసీవర్ క్రెడిల్ చేసి రాజారెడ్డికి సంగతి వివరించాడు.

పార్వతీశాన్ని పంపేసి సార్జంట్, సబిన్స్పెక్టర్లతో జీపు ఎక్కాడు రాజారెడ్డి.

7

హాస్పిటల్ వరండాలో నిల్చుని వాళ్ళకోసమే ఎదురు చూస్తున్నాడు డాక్టర్. వాళ్ళు జీప్ దిగగానే, "నా వెంటరండి!" అంటూ ముగ్గుర్నీ మార్చ్యురీ గదిలోకి తీసి కెళ్ళాడు.

గదిమధ్య టేబిల్ మీద వెల్లకిలా పడుకోబెట్టి వుంది గీతాంజలి శవం. "చెప్పండి ఏం జరిగింది?" అడిగాడు రాజారెడ్డి ఆత్రంగా.

డాక్టర్ జేబులోంచి మడతపెట్టిన చిన్న మైనపు కాగితంతీసి అందించాడతనికి. ఆత్రంగా కాగితం విప్పి చూసాడు ఇన్‌స్పెక్టర్.

అది మ్యాప్!ఇండియన్ ఇంక్‌తో వేసిన ఇంటి మ్యాప్!

"ఎక్కడ దొరికింది మీకు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"శవాన్ని మార్చ్యురీ చెయ్యబోతూ, తలకాస్త పైకి యెత్తడానికి చెయ్యి పెట్టేను. వెంట్రుకలమధ్య ఏదో వున్నట్టు వేళ్ళకి తగిలింది. ఏమిటా అని పరీక్షగా చూశాను. ఇది కనిపించింది. ఆమె జుత్తు అడుగున గమ్‌తో అతికించి వుంది!" అన్నాడు డాక్టర్.

మ్యాప్‌ను జాగ్రత్తగా పరిశీలించాడు ఇన్‌స్పెక్టర్.

అది నాయుడుగారి ఇంటిమ్యాప్!

ఇంటి ముందుభాగమూ, వెనక భాగమూ స్పష్టంగా చిత్రించి వున్నాయి. వెనకభాగంలో దూర దూరంగా నాటిన మూడు మామిడిచెట్లు, ఆ చెట్లనడుమ ఓ సమాధి ఆ సమాధికి కొద్దిదూరంలో నేలపై క్రాస్‌గుర్తూ వేసి వున్నాయి.

"ఇది నాయుడుగారి ఇంటిమ్యాపే. నేను మద్రాసు నుంచి వచ్చి, ఆ ఇంటి పరిసరాలను చూసినప్పుడు

పెరట్లోవున్న ఈ సమాధి నన్నాకర్షించింది. హడావుడిలో అప్పుడు దాని విషయం మర్చాను.

నాయుడుగారు హిందూవులు. మరణించిన వారిని దహనం చెయ్యడం హిందూధర్మం. హిందువులయిన నాయుడుగారి ఇంటి పెరట్లో సమాధి ఏమిటి?'' అడిగాడు రాజారెడ్డి సబిన్‌స్పెక్టర్ని.

అతను భుజాలెగరేసి, ''నేనీ ఊరికి ట్రాన్స్‌ఫరై ఏడాదే అవుతోంది. నాకేమీ తెలీవు...ఆఁ, పరంధామయ్యకి తప్పక తెలిసి వుంటుంది ఈసమాధి గురించి'' అన్నాడు.

సార్జంట్‌ని పంపి, వెంటనే పరంధామయ్యను పిలిపించారు.

ఆయన ఆ కాగితాన్ని చూసి, ''ఔను. ఇది నాయుడుగారి ఇల్లే. మీరన్నట్టు నిజంగానే ఈ సమాధికో కథ వుంది.

చిన్నప్పుడు నైవేద్య ఓ కుక్కని పెంచేది. అదంటే ఆ పిల్లకి పంచ ప్రాణాలు. ఒకరోజు కుక్క జబ్బుపడి మరణించింది.

ఆ దుఃఖాన్ని భరించలేక పోయింది నైవేద్య. దాన్ని ఇంటి పెరట్లో పాతి ఈ సమాధి కట్టించింది. పోతే, మ్యాప్‌లో కనిపిస్తున్న ఆర్రాస్ గుర్తేమిటో నాకర్థం కావటం లేదు'' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపుతూ దాన్ని మడత పెట్టి, పర్సులో భద్రం చేసుకున్నాడు. ''హతురాలు దీన్నింత జాగ్రత్తగా వెంట్రుకలమధ్య దాచుకుందంటే, తప్పకుండా ఇందులో యేదో రహస్యం ఇమిడివుందన్న మాట!

ఉదయం యిక్కడ ఆనందరావ్ ఈమె శవాన్ని ఒక్కసారిచూస్తానంటూ గొడవచేశాడు. రాత్రిళ్ళు అతను నాయుడుగారింటి పరిసరాల్లో తచ్చాడుతూ కనిపించాడు. పదండి. ఇప్పుడతని మత్తు దిగివుంటుంది'' అంటూ వెను దిరగ బోయాడు ఇన్‌స్పెక్టర్.

సరిగ్గా ఆ క్షణంలో తలుపుదగ్గర బూట్సుల శబ్దం వినిపించింది. ''కదలకండి! చేతులెత్తినిల్చోండి అక్కడే'' అన్న కంచుకంఠం విని స్తబ్ధులయ్యారు అంతా.

గుమ్మంలో రెండు భారీశరీరాలు నిల్చున్నాయి. ఇద్దరి చేతుల్లోనూ మెరుస్తున్నాయి పిస్తోళ్ళు.

''మీలో ఎవరయినా, ఏ కాస్త పిచ్చిపని చేసినా, నిర్దయగా కాల్చిపారేస్తాం! చేతులెత్తండి'' ఆజ్ఞాపించాడొకడు.

గత్యంతరంలేదు. చేతులెత్తారంతా!

ఒకడు పిస్తోలుతో వాళ్ళని కవర్‌చేస్తూ తలుపుదగ్గరే నిల్చున్నాడు. రెండోవ్యక్తి మెరుపులా శవంపడున్న టేబుల్ని సమీపించి, శవాన్ని అమాంతం భుజాన వేసుకున్నాడు.

గదిలోవున్న వాళ్ళంతా గుడ్లప్పగించి చూస్తున్నారీ దృశ్యాన్ని. శవంతోసహా అతను తలుపుని సమీపించాడు. దురదృష్టవశాత్తూ సార్జంట్ డేవిడ్ తలుపు దగ్గరే వున్నాడు.

ఒకడు సార్జంట్ డొక్కలో పిస్తోలు పొడిచి, ''మా వెంట ఇతన్ని తీసుకెళ్తాం. మీరు మమ్మల్ని వెంబడించవచ్చు. వెంబడించకుండా బుద్ధిగా వున్నారంటే, కొద్ది దూరంలో ఇతన్ని వదిలేస్తాం. లేదా, చంపి కైలాసానికి

పంపిస్తాం'' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ తలూపాడు.

''పద.'' అంటూ పిస్తోలు మొనతో సార్జంట్‌ని అవత లకి తీసుకెళ్ళారు.

మరుక్షణం కారుబయట ప్టాటయిన చప్పుడు.

ఊహించని ఆ సంఘటన అందర్నీ దిగ్భ్రాంతుల్ని చేసింది.

''ఆ మూర్ఖులకి శవంతో ఏమిటి పని? దేనికి తీసి కెళ్ళారు?'' అడిగాడు డాక్టర్ అయోమయంగా.

ఇన్‌స్పెక్టర్ పలకలేదు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

సార్జంట్ సురక్షితంగా తిరిగివస్తాడా లేదా అని అందరి గుండెలూ పీచుపీచు మంటున్నాయి.

8

గంట తరవాత తిరిగి వచ్చాడు సార్జంట్ డేవిడ్. అతని మోచేతులమీదా, మొహంమీదా చిన్నచిన్న దెబ్బలు కనిపిస్తున్నాయి.

''వాళ్ళతో ఫైట్ చేసి తప్పించుకున్నావా?'' అడి గాడు ఇన్‌స్పెక్టర్.

''నో! కారు మద్రాసు రోడ్ మీదికి మళ్ళి, మైలు దూరం వెళ్ళాక, తమనెవ్వరూ వెంబడించడం లేదని నిశ్చయించుకుని, నడుస్తున్న కార్లోంచి నన్ను తోసేశారు. ఓ లారీ ఎక్కి వచ్చాను.''

''వాళ్ళ సంగతి తరవాత చూద్దాం! ముందు ఆనంద రావుని కలుసుకోవాలి పదండి.'' అంటూ బైటికి నడిచాడు రాజారెడ్డి.

నలుగురూ జీపెక్కి బైలుదేరారు.

పరంధామయ్య చూపిన ఇంటి ముందు దిగారు. తలుపు మూసుంది. తట్టాడు సార్జంట్.

"ఎవరూ?" అంటూ తెరిచింది ఆనందరావు భార్య.

"ఆయన ఉన్నాడా ఇంట్లో?"

"మళ్ళీ తాగి పడుకున్నారండీ!"

సబిన్‌స్పెక్టర్ మొహం చిట్లించాడు. "మాట్లాడే స్థితిలో లేడా?"

ఆమె తల తిప్పి—"మీరెందు కొచ్చారో నాకు తెలుసు! ఆ యువతిని మావారే చంపివుంటారని మీ అనుమానం కదూ? ఆ హత్య ఆయన చెయ్యలేదని గట్టిగా చెప్పగల్ను!" అంది.

ఇన్‌స్పెక్టర్ కళ్ళు విప్పారేయి. "అంత ఖచ్చితంగా చెప్పడానికి ఆధారాలేమిటి?"

"ఉన్నాయి! ఆయన ఒకప్పుడు నైవేద్యని ప్రేమించిన సంగతి నాకు తెలుసు. గత నాలుగు రోజులుగా, నైవేద్య తిరిగి వచ్చిందని ఊళ్ళో పుకారు బైలుదేరింది. అప్పట్నించీ ఆయన వాలకం మారిపోయింది.

రాత్రులు ఇంటికి రావడం మానేశారు. ఆ నైవేద్య తోనే గడుపుతున్నారేమోనని నాకనుమానం వేసింది. నిన్నరాత్రి ఆయన్ని రహస్యంగా వెంబడిస్తూ వెళ్ళాను. నా అనుమానమే నిజమైంది.

ఆయన తిన్నగా నైవేద్య ఇంటికెళ్ళి, ముందు కిటికీ లోంచి తొంగి చూశారు. తరవాత, తలుపు తెరుచుకుని ఇంట్లో ప్రవేశించారు. లోపల వాళ్ళేం చేస్తున్నారో చూద్దామని మెల్లిగా కిటికీని సమీపించి చూసాను.

ఆయనా, ఆ యువతీ మంచంమీద కూర్చున్నారు. ఆమె చేతిలో చిన్న కాగితం వుంది. దాన్ని ఆయనకి చూపిస్తూ ఏదో చెబుతోంది. వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో నేను వినలేకపోయాను.

కాసేపటికి ఆయన ఆమెవద్ద సెలవు తీసుకుని ఇంటికి వచ్చేశారు. అంతవరకూ ఆమె సజీవంగానే వుంది. అందుకే అంత ఖచ్చితంగా చెప్పగలుగుతున్నాను, మావారు ఆ హత్య చెయ్యలేదని!''

ఇన్‌స్పెక్టర్ బుర్ర చురుగ్గా పని చెయ్యసాగింది. ఆ యువతి మూడు రోజుల్నించీ నైవేద్యగా నటిస్తూ ఆ ఇంట్లో తిష్టవేసి, పెరట్లో దేనికోసమో తవ్వుతూ వెతకసాగింది. మూడు రోజులైనా ఆమెకా వస్తువు దొరకలేదు!

తనకి మరొకరి సహాయం అవసరమనీ, ఆ వూరివాళ్ళలోనే ఎవ్వరైనా పట్టాలనీ నిశ్చయించింది. కాకతాళీయంగా, నైవేద్యకోసం అక్కడ పడిగాపులు కాస్తున్న ఆనందరావ్ కనిపించుంటాడామెకి.

అతన్ని లోనికి పిల్చి, ఆ కాగితం చూపించి వుంటుంది. బాగా ఆలోచించి, ఈ రోజు మళ్ళీ వస్తానని చెప్పి వచ్చుంటాడు ఆనందరావ్. అతనిటు రాగానే, అక్కడ ఆమె హత్య జరిగింది.

ఉదయం ఆనందరావుకు ఆమె హత్య సంగతి తెలిసేసరికి, ఎలాగైనా రాత్రి ఆమె చూపించిన మ్యాప్ చేజిక్కించుకోవాలనుకున్నాడు. అందుకే, హాస్పిటల్లో ఆమె శవం పోస్ట్‌మార్టం జరుగుతున్నప్పుడు ఒక్కసారి చూస్తానని గొడవచేశాడు.

"ఆయనతో కూడ మాట్లాడాలి. పిలవండి." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆనందరావు భార్య లోనికెళ్ళిన రెండు నిమిషాల తరవాత, తడబడే అడుగులతో బైటికి వచ్చాడు ఆనందరావ్.

అతన్ని జీప్ ఎక్కించి, తిన్నగా స్థానిక పోలీస్ స్టేషన్‌కి తీసికెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

"మిస్టర్ ఆనందరావ్! నాయుడుగారింట్లో హత్య జరిగిన రాత్రి, నీవా ఇంటికెళ్ళావనీ, హతురాలు నీకు నిధికి సంబంధించిన ఒక మ్యాప్ చూపించిందనీ మాకు తెలుసు! ఏమంటావ్?" అడిగాడు రాజారెడ్డి.

ఆనందరావు మత్తు సగం వదిలింది. "ఆ మ్యాప్ గురించి మీకెలా తెలిసింది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎలా తెలిసిందో నీకనవసరం! నేను చెప్పింది నిజమేనని ఒప్పుకుంటావా, లేక మా పద్ధతులుపయోగించి నిజాన్ని కక్కించమంటావా?"

"నిజమే! ఆ రాత్రి నేను నైవేద్యని చూడాలన్న కాంక్షతో వెళ్ళానా ఇంటికి. ఐతే, అక్కడ నైవేద్యకి బదులు ఎవ్వరో అపరిచిత యువతి కనిపించింది.

ఆమెని చూడగానే నాకు ఒళ్ళు మండిపోయింది. నాలుగు రోజుల్నుంచీ నన్ను తికమక పెట్టినందుకు, ఇప్పుడే వెళ్ళి ఊళ్ళో అందరికీ నిజం చెప్పేస్తానని దుర్భాషలాడేను.

దాంతో ఆమె నన్ను లోనికి ఆహ్వానించి, తను నైవేద్య స్నేహితురాలిననీ, ఆమె తండ్రిగారు పాతిపెట్టిన నిధికోసం నైవేద్యే తనను పంపిందనీ, నాలుగు రోజు

ల్నించి ప్రయత్నిస్తున్నా ఆ నిధి జాడ దొరకడం లేదనీ, నా సహాయం కావాలనీ, నిధి దొరికితే అందులో పాతిక శాతం నా కిస్తాననీ, మరో పాతిక భాగం తనుంచుకుని, మిగిలింది నైవేద్య కిస్తాననీ ఓ మ్యాప్ చూపించింది నాకు.

దాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలించాను. అందులో సూచించిన ఉక్కుసమాధీ, నైవేద్య కట్టించిన అసలు సమాధీ తారుమారుగా చిత్రించ బడ్డాయని నాకెందుకో అనుమానం వేసింది.

కారణం అనాడు నైవేద్య తన ఉక్కుసమాధి ఎక్కడ కట్టించిందో నాకు బాగాగుర్తు. ఆ సమాధి ఈశాన్య దిశలో, ఇప్పుడున్న సమాధికి చాలా దూరంలోవుండేది. అక్కడ నిల్చునిచూస్తే, సరిగ్గావాళ్ళ దొడ్డిగుమ్మం కనిపించేది. ఇప్పుడున్న సమాధి దానికి విపరీత దిశలోవుంది.

మరి మ్యాప్‌లో దాన్ని తప్పుగా దేనికి చిత్రించారు. ఆ విషయాన్నే వివరంగా ఆలోచించి, ఓ నిశ్చయానికి రావాలని, మర్నాడువచ్చి కలుస్తానని ఆమెతో చెప్పి వచ్చేశాను" అన్నాడు ఆనందరావు.

రాజారెడ్డి స్థానిక సబిన్‌స్పెక్టర్‌వైపు తిరిగి, "ఇద్దరు కానిస్టేబుళ్ళని పంపి, గడ్డపారలూ మొదలయినపనిముట్లు తెప్పించండి. మనం ఇప్పుడే నాయుడుగారింటికెళ్ళి ఆ నిధి ఎక్కడుందో తవ్విచూద్దాం" అన్నాడు.

అతను తలూపి, కానిస్టేబుళ్ళకి ఆదేశాలిచ్చాడు. పావుగంటలో, పనిముట్లు మోసుకొచ్చేరు వాళ్ళు.

ఆనందరావుని వెంటబెట్టుకుని, అందరూ జీప్‌లో బయలుదేరారు.

9

నాయుడుగారింటి వెనుక భాగమంతా చీకట్లో మునిగి వుంది. టార్చిలైట్లు వెలిగాక ఆనందరావు వైపు తిరిగి, "ఠక్క అసలు సమాధి ఎక్కడుంది?" అడిగేడు యిన్స్పెక్టరు.

ఆనందరావు పదినిమిషాల వరకూ నేలనీ, పరిసరాలనీ, క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఓచోట ఆగాడు. "ఇక్కడే ఉండేది. అదిగో, ఇక్కణ్ణించి ముక్కుకు సూటిగా ఆ వొడ్డికమ్మం కనిపిస్తోంది చూడండి" అన్నాడు.

ఇన్స్పెక్టర్ మ్యాప్ తో అక్కడికెళ్ళి నిల్చున్నాడు. అందులో, ఠక్క సమాధికి ఈశాన్యంవైపు పాతిక అడుగులు అని రాసివుంది. ఆనందరావు నిల్చున్న చోటు నుంచి, ఆవైపు అడుగులు వేస్తూ లెక్కపెట్టాడు.

సరిగ్గా పాతిక అడుగులు వేసి ఆగిపోయాడు. కానిస్టేబుళ్ళని కేకేసి అక్కడ తవ్వమని ఆజ్ఞాపించాడు.

తవ్వకం ప్రారంభమైంది.

అందరూ ఊపిరిబిగబట్టి చూస్తున్నారు. గంటలోపల మూడడుగులలోతు నాలుగడుగుల వెడల్పు గొయ్యి తయారయింది. గొయ్యి లోతు అధికమౌతున్నకొద్దీ క్యూరియాసిటీతో అందరి గుండెలూ దడదడలాడసాగాయి.

హఠాత్తుగా, ఓ కానిస్టేబుల్ గావుకేక పెట్టాడు.

"ఏం జరిగింది?" అంటూ గొయ్యిని చుట్టుముట్టేరంతా.

లోపల కనిపించిన దృశ్యం వాళ్ళని దిగ్భ్రాంతుల్ని చేసింది.

గోతిలో ముడుచుకు పడుంది ఓ అస్థిపంజరం!

మానవ అస్థిపంజరం!!

"తియ్యండి బయటకి" అరిచాడు ఇన్‌స్పెక్టర్.
సార్జంట్ డేవిడ్, సబిన్‌స్పెక్టరు ఒంగుని, ఆ కంకాళాన్ని బయటికి తీసారు. టార్చి వెలుగులో, ఆ అస్థిపంజరం చేతి ఎముకలకి మట్టి కొట్టుకున్న గుండ్రని వేవో కనిపించి, పరీక్షగా చూసాడు రాజారెడ్డి.
అవి గాజులు!
ఎర్రని మట్టిగాజులు!!
ఇన్‌స్పెక్టర్ బుర్రలో సినిమారీళ్ళు తిరగసాగాయి. "ఆనందరావ్! నీవు నైవేద్యను ప్రేమించావుకదూ?" అడిగాడు గంభీరంగా.

"ప్రేమించడం కాదు ఇన్‌స్పెక్టర్! ఆరాధించాను. తపస్సుచేసాను. అందుకే, నా మనఃఫలకంమీంచి ఆమె రూపాన్ని చెరుపుకోలేక పోయాను యింతకాలం!"
"ఆమెలో ఏం ప్రత్యేకత వుండేదని ఇంతగా ఆమె పిచ్చిలో పడ్డావ్?"
"ఆరోజుల్లో మీరామెను ఒక్కసారి చూసివుంటే ఇలా అనేవారుకాదు ఇన్‌స్పెక్టర్. ఆమె ఒక సౌందర్య దీప్తి, కావ్యప్రాప్తి. వెన్నెల్లో ఆమె పచార్లు చేస్తుంటే జాబిల్లికూడా వెలవెలబోతూ సిగ్గుపడేది. అటువంటి అపురూప అందాల ఖని, నావంటి పామరుడి ఆరాధనకు అయోగ్యురాలంటారా?"
ఇన్‌స్పెక్టర్ ఆ అస్థిపంజరంమీద టార్చివేసి, "చూడు ఆనందరావ్! ఆనాటి నీ అందాలరాశి ఇప్పుడేమైందో?" అన్నాడు నవ్వుతూ.
ఆనందరావ్ రెప్ప వెయ్యకుండా కాసేపు ఆ కంకాళాన్ని చూసి, గావుకేక పెడుతూ నేలకూలి, మూర్ఛపోయాడు.

"ఇగి నైవేద్య స్పెషాలిటనా? మీకెలా తెలుసు?" అడిగాడు సబిన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

"చెబుతాను! త్వరగా పదండి!" అంటూ జీపువైపు పరిగెత్తాడు ఇన్‌స్పెక్టర్. కానిస్టేబుళ్ళు కింద పడున్న ఆనందరావుని ఎత్తి జీప్‌లో పడుకోబెట్టారు.

మరుక్షణం జీపు ఊరివైపు పరుగు తీసింది.

10

"పార్వతీశం ఇల్లు ఇదేకదూ?" అడిగాడు రాజారెడ్డి జీపుకి బ్రేక్ వేస్తూ. సార్జంట్ తలూపాడు.

"రండి!" అంటూ జీప్ దిగి, కాంపౌండ్ వైపు నడిచాడు రాజారెడ్డి.

కాంపౌండ్‌లో పార్వతీశం ఫియట్ కారు ఆగివుంది.

"అయ్యగారు వున్నారా?" అడిగాడు వరండాలో ఎదురయిన నౌఖర్ని.

"ఉన్నారండి. అమ్మగారూ, అయ్యగారూ ఇప్పుడే వచ్చారండి. మేడమీదున్నారు. పిలవమంటారా?"

"అక్కర్లేదు. మేమే వెడతాం" అంటూ హాల్లోకి ప్రవేశించాడు ఇన్‌స్పెక్టర్.

హాలు పక్కనే పైకెళ్ళడానికి మెట్లున్నాయి. ఇన్‌స్పెక్టర్ని అనుసరిస్తూ అందరూ మేడమీదికెళ్ళారు.

పైన రెండు గదులున్నాయి. ఓగది తలుపు మూసివుంది. మునివేళ్ళతో తలుపు తట్టబోయాడు ఇన్‌స్పెక్టర్. చెయ్యి పడగానే కిర్రుమంటూ తెరుచుకుంది.

లోపల చీకటి! చిమ్మ చీకటి!!

"పార్వతీశం!" పిల్చాడు.

జవాబులేదు.

టార్చి వెలిగించాడు. ఆ వెలుగులో నేలమీద కని పించిన దృశ్యం, ఇన్ స్పెక్టర్ నెత్తిన ఉరుములేని పిడుగు వేసింది. కళ్ళప్పగించి అలాగే చూస్తుండి పోయాడు.

నేలమీద వెల్లకిలా పడుంది ఉపాసన!

నుదుటిమధ్య బొట్టుపెట్టినట్టు గుండ్రని రంధ్రం! ఆ రంధ్రంలోంచి వుబికి చారలు చారలుగా కారిన రక్తం! కళ్ళు ఏదో భయంకర దృశ్యం చూస్తున్నట్టు తెరచి వున్నాయి.

వెంటనే గోడ తడిమి లైటు వెలిగించాడు. ఆ వెలుగులో గదిమధ్య కనిపించిన దృశ్యం అందర్నీ స్తబ్దుల్ని చేసింది.

గదిమధ్య తాడుకి వేలాడుతున్నాడు పార్వతీశం!

ప్రాణంలేని పార్వతీశం!!

సరిగ్గా అతని కాళ్ళదగ్గర, నేలమీద రెపరెపలాడుతోంది ఓ కాగితం.

చటుక్కున దాన్ని అందుకున్నాడు ఇన్ స్పెక్టర్.

అది మరణించేముందు పార్వతీశం రాసిన ఉత్తరం.

"డియర్ ఇన్ స్పెక్టర్!

ఈ నిర్ణయం నేనెప్పుడో తీసుకోవలసింది. కాని, విధి చేతిలోనూ, నాభార్య చేతిలోనూ యింతకాలం కీలుబొమ్మనయి ఆడుతూ వచ్చాను. ఇహ ఆట్టేకాలం మా రహస్యం దాగదని తెలిసిపోయింది. అందుకే ఈ తుది నిర్ణయం తీసుకొన్నాను.

చచ్చేముందు ఆ విషాదగాథ మీకు చెప్పడం ధర్మం.

నా అభీష్టానికి విరుద్ధంగా, మా పెద్దలు ఉపాసనతో నాపెళ్ళి చేసారు. బాల్యంనుంచి భీరువుని కావడంవల్ల

అప్పుడు నోరెత్తలేక పోయాను. నిజానికి ఉపాసన కూడ నన్ను మనసారా ప్రేమించింది.

నేను మద్రాసునుంచి భార్యా సమేతంగా ఈ ఊరు వచ్చి ప్రాక్టీసు ప్రారంభించాను.

నేను చేసినపనికి నైవేద్య మనసు ఛిన్నాభిన్నమైంది. ఆమెని ఓదార్చడానికీ, మళ్ళీ మామూలు మనిషిని చెయ్యడానికీ తరచూ వాళ్ళింటికెళ్ళేవాడిని.

దాంతో ఉపాసన ఈర్ష్యాభిమానాలతో దహించుకు పోసాగింది. నేను నైవేద్యను కలుసుకోకూడదని ఆంక్షలు పెట్టేది. ఐనా, ఆమెకళ్ళుగప్పి నైవేద్యను కలుసుకొనేవాణ్ణి.

ఒకరాత్రి మామూలుగా నైవేద్యని కలుసుకోడానికెళ్ళాను. అప్పుడామె తోటలో కూర్చునుంది. నాయుడుగారు పనిమీద ఏదో ఊరెళ్ళారు.

నన్ను వెంబడిస్తూ అక్కడికి ఉపాసన ఎప్పుడొచ్చిందో తెలీదు. చీకట్లోంచి మెరుపులా ఇవతలికివచ్చి, పిస్తోలుతో నైవేద్యమీద కాల్పులు జరిపింది.

ఆమె అక్కడికక్కడే మరణించింది. నేను నిర్ఘాంత పోయాను.

కేవలం నామీది ప్రేమతో, నైవేద్యమీది ఈర్ష్యతో ఆ హత్యచేసిన ఉపాసనపట్ల నాకు జాలివేసింది. ఆమెను కాపాడాలనే ఉద్దేశంతో, అప్పటికప్పుడు గొయ్యితవ్వి నైవేద్యను పూడ్చేశాను.

అప్పుడే ఆగొయ్యి తవ్వేటప్పుడే నాయుడుగారు అక్కడ దాచిపెట్టిన నిధికూడ మాకుదొరికింది. నాయుడు గారు చనిపోయేటప్పుడు నైవేద్యకు అందజేయమని ఆ నిధి

మ్యాప్ నా చేతికిచ్చాడు. నేను ఎందుకయినా మంచి దని పక్క సమాధి మరోచోట కట్టించి మ్యాప్ మరొకటి తయారుచేసాను.

నైవేద్యను చంపిన తరువాత, ఆమె ఇల్లువిడిచిపోయి నట్టు దొంగలేఖ సృష్టించి, అందర్నీ మభ్యపెట్టాను.

ఆ తరువాత ఆమె సజీవంగా వున్నట్టు నమ్మించ డానికి, గీతాంజలి అనే యువతిని పరిచయం చేసుకుని, దేశం నలుమూలలనించి నైవేద్యలా ఉత్తరాలు రాయమని డబ్బిచ్చాను. ఆమె ఉత్తరాలెలా రాయాలో, ఎప్పటి కప్పుడు తెల్పేవాణ్ని.

ఉపాసన తనుచేసిన నేరాన్ని మర్చిపోడానికితాగుడూ, పేకాటా అలవాటు చేసుకుంది. అప్పుడే, ఆ గీతాంజలికి 'బ్లూస్టార్ నైట్ క్లబ్' దివాకర్‌తో పరిచయమయింది. అతని ప్రోద్బలంతోనే, ఆమె నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యసాగింది.

ఆమె కోరినంత ఇచ్చుకోడానికి, క్రమక్రమంగా నైవేద్య ఆస్తిని అమ్మసాగేను. ఇక ఏమీ మిగల్లేదు. చివరికి విసుగెత్తి, ఆ దొంగమ్యాప్ గీతాంజలికి చూపాను. దాన్ని తీసుకుని, నేనామెకి రాసిన ఉత్తరాలు యివ్వ మన్నాను.

గీతాంజలి సగం ఉత్తరాలిచ్చి, మిగతా సగం నిధి దొరికేక ఇస్తానంది. ఈ విషయం తెలిసిన దివాకర్ ఆమెని వెంబడిస్తూ వచ్చి, ఆమెని చంపి, మ్యాప్‌కోసం ప్రయత్నించాడు...

చూశారా! ఒక్క నేరాన్ని కప్పిపుచ్చడానికి నేను ఎన్ని తప్పులు చెయ్యవలసి వచ్చిందో!

ఇహ, చివరికి మిగిలేదేమీ లేదని తెలిసివచ్చింది. దీని కంతటికీ మూలకారణమైన నాభార్యని చంపి, నేనూ చస్తున్నాను.

సెలవ్,

పార్వతీశం!''

—: ఐపోయింది :—